క్లుప్తంగా

16న వాహనాల వేలంపాట

రాజంపేట : వివిధ ఎక్సైజ్ నేరాలలో పట్టుబడి సీజ్ అయిన వాహనాలకు ఈనెల 16న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట ఎస్‌ఈబీ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ (రాయచోటి) ఆదేశాల మేరకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఎస్‌ఈబీ స్టేషన్‌లో సంప్రదించగలరన్నారు.

16 నుంచి విద్యార్థులకు బస్ పాసులు

రాజంపేట : ఈనెల 16 నుంచి విద్యార్థులకు బస్‌పాసులు జారీ చేస్తున్నామని రాజంపేట డిపో మేనేజరు రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉచిత, రాయితీ బస్‌పాసులను రాజంపేట డిపోలో ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆశ వర్కర్ల సదస్సును విజయవంతం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : ఆశ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15 నేడు కడప ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగే ఆశ వర్కర్ల సదస్సును విజయవంతం చేయాలని బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ గంగాధర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఈ సమావేశంలో ఆశ వర్కర్ల సమస్యలపై పలు తీర్మానాలు చేయనున్నామని తెలిపారు. కావున ప్రతి ఒక్క ఆశ వర్కర్ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఏపీఓ శ్రీనివాసులు

పుల్లంపేట : పుల్లంపేట ఏపీఓగా బుధవారం శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏపీఓగా పనిచేసిన సుభావతి విజయవాడకు బదిలీ అయ్యారు. శ్రీనివాసులు అనంతపురం నుంచి పుల్లంపేటకు బదిలీపై వచ్చారు.

మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు బుధవారం చీరలను పంపిణీ చేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు సతీష్‌చంద్ర తల్లి చంద్రావతి 8వ వర్ధంతిని పురస్కరించుకుని క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని సాయినాథ్ మెన్స్‌వేర్ వద్ద 50 మంది మున్సిపల్ కార్మికులకు చీరలను క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు కావలి వెంకట సుబ్బారెడ్డి, సభ్యులు వినోద్‌నాయక్, అన్నమయ్య నాయక్‌తోపాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలకు బల్లల వితరణ



పాఠశాలకు బల్లలు అందజేసిన దాతలు

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం కదిరివాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు వండాడి గ్రామ సర్పంచ్ ముసల్‌రెడ్డి కుటుంబసభ్యులు దాదాపు రూ.50 వేలు విలువ చేసే 12 బల్లలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని, అందుకు అవసరమయ్యే నిధులు తాను సమకూరుస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముసల్‌రెడ్డి, ఎంఈఓ శివానాయక్, హెచ్‌ఎం రెడ్డిప్రసాద్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈశ్వరీ దేవికి పుష్పాభిషేకం



ఈశ్వరీదేవికి వివిధ రకాల పుష్పాలతో అభిషేకించిన దృశ్యం

చిట్వేలి : నగిరిపాడులోని ఈశ్వరిదేవి మఠంలో అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. శ్రీశాంతనంద రంగయ్యస్వామి 16వ ఆరాధనోత్సవాలు సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అభిషేకించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు ఆరాధనోత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



అవార్డును అందుకుంటున్న ఓబులపతి



రాజంపేట రూరల్: రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న పోలా, వైద్య బృందం



రాజంపేట: రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రాజంపేట రూరల్ : దాతలు ఉచితంగా అందజేసే రక్తదానం ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేస్తుందని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ఎస్.చెన్నకృష్ణ, డాక్టర్ సానే శేఖర్, సూపర్‌డిడెంట్ డాక్టర్ నాగేశ్వరరాజుల ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పోలా వైద్యులతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వైద్యసిబ్బంది, దాతలు దాదాపు 80 మందికి పైగా రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు ఇమ్రాన్, కృష్ణకాంత్, గురుమహేష్, చంద్రకళ, రాష్ట్ర సీహెచ్‌ఓసీ గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్, ఏపీజీఏ రాజంపేట తాలుకా అధ్యక్షుడు యు.సిద్ది రామయ్య, నీరజ తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య ఫార్మసీలో..

రాజంపేట : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాల(ఏఐటీఎస్)లో విద్యార్థులు రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ రక్తాదానం మహాపుణ్య కార్యమన్నారు. రక్తదానం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడిన వారమవుతారన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆమె అభినందించారు.

ఏఐటీఎస్‌కు రెడ్‌క్రాస్ సంస్థ అవార్డు

ఏఐటీఎస్‌కు వైఎస్సార్ కడప రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ అవార్డును అందించింది. ఒకే రోజులో అధిక సంఖ్యలో రక్తదానం చేసినందుకు ఈ అవార్డు వరించిందని ప్రిన్సిపాల్ నారాయణ బుధవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డా.ఓబులపతి స్వీకరించారన్నారు. రక్తదానంలో ముందుంజలో ఉండేలా కృషి చేసిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డిలు అభినందించారన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేస్తున్న ఆర్‌వి.రమణ

రైల్వేకోడూరు : మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలోని ఆర్.రాచపల్లి, రాఘవరాజుపురం దళితవాడ, అరుంధతివాడ , గంగరాజుపురం గ్రామాలలో బుధవారం ఆర్.వి.రమణ చేతులమీదుగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, ధనిక అనే తారతమ్యాలకు చెక్ పెట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్‌కు బాటలు వేశారన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా, ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చించి ప్రభుత్వం అందిస్తున్న విద్యాకానుకలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యాపరంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న పారా మెడికల్ ఉద్యోగులు

రాయచోటి టౌన్ : ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రాయచోటి ఏరియా ఆస్పత్రి ఆవరణలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. జగనన్న నువ్వే మా నమ్మకం.. నువ్వే మా భవిష్యత్తు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఎస్. ఖాదర్ బాషా మాట్లాడుతూ 2019లో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చుకోవడానికి ఈనెల 7వ తేదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశంలో పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి తీర్మానం చేశారన్నారు. ఈ నిర్ణయంపై తామంతా సంతోషం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. 2014 సంవత్సరానికి బదులుగా 2019వ సంవత్సరం సీఎంగా జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజును కటాఫ్ డేట్‌గా ఫిక్స్ చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. జేఏసీ జిల్లా కన్వీనర్లు రవిశంకర్, ఎం.సుదర్శన్ రాజు, డి. రామచంద్ర, ఎం.ధర్మారెడ్డి, సింగర వెంకటరమణ, ఎస్.ఖదీర్, ఐ.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా, కడప మేయర్ సురేష్‌బాబు

సిద్దవటం : మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాలకు చెందిన భూములు పెన్నానది వరద నీటితో కోతకు గురైన భూములను బుధవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాలకు చెందిన కొందరి రైతుల భూములు పెన్నానదికి వరద నీరు వచ్చినప్పుడల్లా విలువైన భూములు కోతకు గురవుతూనే ఉన్నాయన్నారు. భూములు వరద నీటితో కోతకు గురి కాకుండా రూ. 40 లక్షల నిధులతో చేపట్టిన ఎంబ్యాక్‌మెంట్ పనులను పరిశీలించి కాంట్రాక్టర్ నవీన్‌రెడ్డికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జేఏసీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, సీనియర్ నాయకుడు క్రిష్టారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవహర్ బాషా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామిరెడ్డి, శివారెడ్డి, ఆదిరెడ్డి, రమణ, వెంకటేశ్వర్లు, నాగరాజుశర్మ, నిమ్మకాయల ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని కడపాయపల్లె, లింగంపల్లె గ్రామాలకు సంబంధించిన కోదండ రామస్వామి ఆలయం నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సంబంధించి పనులను త్వరగా మొదలుపెట్టాలని వారు స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో స్థానికులు శివరామిరెడ్డి, శివారెడ్డి, నాగరాజశర్మ, వెంకటేశ్వర్లు, గొంటిముక్కల రమణ, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకోవాలి



రాయచోటి టౌన్ : ఎమ్మెల్యే మేడాను సన్మానిస్తున్న సానిపాయి గ్రామస్తులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రతి ఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం వీరబల్లె మండల పరిధిలోని సానిపాయి గ్రామం జింక దళితవాడలో ఆ గ్రామ సర్పంచ్ నేతి ఆంజనేయుల ఆధ్వర్యంలో కోదండ రామాలయానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య పుట్టిన జిల్లాలో గ్రామగ్రామాన రామాలయాలు వెలయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీని వల్ల గ్రామాలలో భక్తిభావాలు పెరుగుతాయన్నారు. అనంతరం గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, సీతారామరాజు, వీరబల్లె జేసీఎస్ మండల కన్వీనర్ ముకుందాపురం నరేష్, రెడ్డెప్పరెడ్డి, రాజంపేట వార్డు కౌన్సిలర్ ప్రతాప్ నాయుడు, రామచంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై సూచనలు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్ర

చిన్నమండెం: కాయల కోత తరువాత మామిడి తోటల్లో తీసుకోవాల్సిన యజమాన్య పద్ధతులపైన జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు రైతులకు పలు సూచనలు అందించారు. బుధవారం మండలంలోని దిగువగొట్టివీడు పంచాయతీలోని విశ్వనాథరెడ్డి అనే రైతు మామిడి తోటలో కొమ్మలను ఎలా కత్తిరించాలి, ఎలాంటి ఎరువులు వేయాలి, అనే దానిపై రైతులకు డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి వనిత, సచివాలయం సిబ్బంది రాజేష్, రైతులు పాల్గొన్నారు.

నాడు – నేడుతో విప్లవాత్మకమైన మార్పులు



భూమిపూజ చేస్తున్న సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తల్లెంవారిపల్లె దళితవాడ గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి సాయికిషోర్‌రెడ్డి నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.8 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించనున్నారు. అనంతరం గాదెల ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పలు విషయాలను ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొమ్మూరు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, నాయకులు కొమ్మూరు నారాయణరెడ్డి, కొమ్మూరు శంకర్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీలు నరసిహులు, దుర్గాప్రసాద్, స్థానికులు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి




మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్

గాలివీడు : జూన్ 27 నుంచి 30వ తేదీ వరకు గుంటూరులో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ తెలిపారు. బుధవారం గాలివీడులో పర్యటించి మాట్లాడుతూ దేశంలో నల్లదొరల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు 1959లో ఏర్పాటైన యువజన సమాఖ్య నాటి నుంచి నేటి వరకు అనేక సమస్యలపై గళమెత్తి పోరాడిందని, దాదాపు వేల మంది ప్రతినిధులతో అనేక అంశాలపై యువతలో అవగాహన పెంచేందుకు శిక్షణా తరగతుల నిర్వహణకు రాష్ట్ర సమితి శ్రీకారం చుట్టిందన్నారు. మండలంలోని యువత పెద్ద ఎత్తున శిక్షణా తరగతులకు హాజరుకావాలన్నారు. సమావేశంలో భాస్కర్, శివారెడ్డి, పవన్ కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్లకు కొత్త ఫోన్ నెంబర్లు

చిట్వేలి : మండలంలోని మూడు విద్యుత్ సబ్ స్టేషన్లకు ఫోన్ నెంబర్లు మార్చినట్లు ఏఈ వెంకటాచలపతి తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఈ సబ్ స్టేషన్లకు బీఎస్ఎన్ఎల్ ఫోన్ నెంబర్లు ఉండేవని, ఈ టవర్ నుంచి సక్రమంగా సిగ్నల్స్ అందకపోవడంతో అటు రైతులు, ఇటు సిబ్బంది అవస్థలు పడుతుండేవారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతుల సౌకర్యార్థం మూడు సబ్ స్టేషన్లకు ఫోన్ నెంబర్లు కేటాయించామన్నారు. ఖాకరాపురం సబ్ స్టేషన్‌కు 8712625861, వెంకట్రాజుపల్లి సబ్ స్టేషన్‌కు 8712625860, కస్తూరివారిపల్లి సబ్ స్టేషన్‌కు 8712625862 ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేశామని ఏఈ పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులకు గమనించాలని తెలిపారు.

భూ ఆక్రమణలపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

పెనగలూరు : ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. బుధవారం ఆయన వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి రికార్డులు లేకుండా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో చేరే సమయం కావడంతో వారి సర్టిఫికెట్లను ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేసి ఇవ్వాలన్నారు. సచివాలయ పరిధిలో సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. పలు అంశాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీఓ

రామాపురం : మండలంలోని చిట్లూరు, హసనాపురం, నల్లగుట్టపల్లె , కొత్తపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఎంపీడీఓ హైదర్‌వలి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్క సచివాలయం ఉద్యోగి సమయం పాటించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకొని పరిష్కరించాలని సిబ్బందికి తెలియజేశారు.

గంగనేరు ప్రాజెక్టు చెరువులో చేపల వేలంపాట

రామాపురం : గంగనేరు ప్రాజెక్టు చెరువులో చేపల వేలంపాటను మత్స్యశాఖ అధికారి మోహనకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ వేలంపాటలో ఐదు మంది పాటాదారులు పాల్గొని నాగప్రసాద్‌రెడ్డి రూ.1 లక్షకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. జులై 1 నుంచి 2024 జూన్ 30వ తేదీ వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు రామాంజనేయులు నాయక్, ఆ గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ బిందు, పలువురు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న చిన్నవెంగల్ రెడ్డి

పెనగలూరు : మండల కేంద్రంలోని అగ్రహారంలో నూతన తాగునీటి బోరును ఉప సర్పంచ్ దేపూరు చిన్నవెంగల్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. పంచాయతీలోని పెనగలూరు అగ్రహారం వీధి ఎత్తు ప్రాంతంలో ఉండటంతో తాగునీరు సక్రమంగా రాకపోవడంతో నూతన బోరు వేసినట్లు వారు తెలిపారు. పంచాయతీలో ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే తాగునీటిని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అడిగిన వెంటనే బోరువేసి తాగునీటిని అందించిన వెంగల్ రెడ్డికి అగ్రహారం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ సుబ్బరాయుడు, సచివాలయ సెక్రటరీ సురేష్, విజయ భాస్కర్, కోడూరు మురళీ, మల్లి, జనార్దన్ రెడ్డి, రాఘవరెడ్డి, నాగినేని మురళి, సింగనమల జనార్దన్, హరి, రమణ పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు బెటాలియన్ విద్యార్థి

సిద్దవటం : వైఎస్సార్ జగనన్న ఆణిముత్యాల కింద సిద్దవటం మండలం నుంచి ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బండారు ప్రవీణ్‌కుమార్ ఎంపికై య్యారని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. విద్యార్థికి గురువారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థి, వారి తల్లిదండ్రులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆలయానికి విరాళం

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని వంగిమళ్ల గ్రామంలో నూతనంగా నిర్మితమవుతున్న ఎల్లమ్మ ఆలయానికి రాజంపేట నియోజకవర్గ నాయకుడు గాలివీటి విజయసాగర్ రెడ్డి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. విజయ సాగర్ రెడ్డికి వంగిమళ్ల ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కనీసం వార్డు మెంబర్లుగానైనా గెలిచారా?

- రాజంపేట టీడీపీ నియోజకవర్గ నాయకులను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- తెలుగుదేశం నాయకులు పనుల కోసం ఎమ్మెల్యే మేడాను కలిసింది వాస్తవం కాదా



మాట్లాడుతున్న పాపినేని విశ్వనాథరెడ్డి, నాయకులు

రాజంపేట టౌన్ : రాజంపేట నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ నాయకులుగా చెలామణి అవుతున్న గంటా నరహరి, బత్యాల చెంగల్‌రాయుడు, చమ్మర్తి జగన్‌మోహన్‌రాజు కనీసం వార్డు మెంబర్లుగా అయినా గెలిచారా? అంటూ వైఎస్సార్‌సీపీ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి ప్రశ్నించారు. స్థానిక మేడా భవన్‌లో బుధవారం వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని విమర్శించడం హాస్యస్పదంగా ఉందన్నారు. మేడా, ఆకేపాటిలు రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారని మీరు వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదని, భవిష్యత్తులో కూడా గెలవబోరన్నారు. తెలుగుదేశం పార్టీకి రాజంపేట ప్రాంతంలో అభ్యర్థి లేక ఆ పార్టీ పక్క నియోజకవర్గాల నుంచి అరువు తెచ్చుకునే దుస్థితిలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి ఇద్దరు వలస నేతలు టీడీపీ టికెట్ తనదే అంటే టికెట్ తనదని తిరుగుతున్నారని, అయితే ఆ ఇద్దరు నేతల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా ఘోరంగా ఓడిపోతారని టీడీపీ అధిష్టానమే భావిస్తున్నట్లు నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబం మొదటి నుంచి వందల ఎకరాల భూస్వామి కుటుంబమని, అలాగే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబం కూడా మొదటి నుంచి ఆర్థికపరిపుష్టిగలదన్నారు. నిత్యం సేవా కార్యక్రమలు నిర్వహించే మేడా, ఆకేపాటిలు ఎక్కడా.. ఎన్నికల ముందు దర్శనమిచ్చే మీరు ఎక్కడ. ప్రెస్‌మీట్లు పెట్టి తమ పార్టీని, తమ నాయకులను విమర్శించే టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు సిగ్గు లేకుండా దొంగచాటున ఎమ్మెల్యే వద్దకు వచ్చి పనులు చేసుకుపోతుండటం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఒకప్పుడు పశువుల కాపరి అయిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసనాయుడు తన స్థాయిని మరచి విమర్శిస్తే ఏమాత్రం సహించేది లేదని ఎస్సీసెల్ విభాగం నాయకులు దాసరి పెంచలయ్య, జయరామయ్యలు హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అన్ని వీధులకు సీసీ రోడ్డుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉపసర్పంచ్ తోట శివసాయి, స్టేట్ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్‌లతో కలిసి బాలానగర్‌లో పంచాయతీ నిధులు రూ.6లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.4లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుగు శివయ్య, వార్డు మెంబర్ రమణ, రౌఫ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.